


## సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

***10***

### ***1 పురందరోపనిషత్***

పురందర దాసు పూర్వనామం శ్రీనివాస నాయకుడు. వజ్రాలు, రత్నాల, గుర్రాల పెద్దవ్యాపారి. తన భార్య తన వజ్రాల ముక్కుపుడకను దానమిచ్చిన సందర్భంలో దైవభక్తుడుగా మారిపోయిన వాడు పురందరదాసు. విజయనగర సామ్రాజ్య రాజధాని హంపిని చేరి సర్వదాస్తులూ దానధర్మాలు చేసి, పురందరదాసు అనే వ్యవహారనామం పేరుతో వ్యాసతీర్థుల నుంచి హరిదాసు దీక్షను పొంది.. మధుకర వృత్తిద్వారా కుటుంబాన్ని పోషించిన మహానుభావుడు శ్రీనివాస నాయకుడు. దేశంలోని ప్రధాన దేవాలయాలన్నింటిని సందర్శించుకుని వాటిలో కొలువై ఉన్న దైవాలను కొలుస్తూ కీర్తిస్తూ ఆసువుగా పదాలను అల్లిన వాగ్గేయకారులు పురందరదాసు. ఈయనా వేమనలాగా, తాళ్ళపాక అన్నమాచార్యుల వారి లాగా సంఘం మీదా ఒక దృష్టి ఉంచి మూఢాచారాలను, చెడుగులను వ్యంగ్యవైభవంతో చెండాడిన మానవతావాదే అందుకు ఈ క్రింది పదాల వంటివి ఎన్నెన్నో ఉదాహరణలు:

***మధ్యమావతి రాగంలో అటతాళ గతిలో సాగిన గేయం ఇది.***

అంతా నా కెరుకేనంటారేమి
అవగుణం వీడరేమి ||ప||
ఎప్పుడూ శరణుల కథలను చెబుతూ
తప్పుడు మాటలు ఆడుదరేమి ||అప||
కావిని కట్టి తిరుగుదురేమి.. కామము వీడరేమి
నియమనిష్ఠలు పాటంతురేమి... తామసం వీడరేమి.
తమనే ఎరుగక పరులను తెలియక
శ్వాసపు గుంతలో పడుతారేమి (1)
గురువుల సేవ చేయుదరేమి గురి నిలపరేమి
పరిపరిదేశాల్ తిరుగిననేమి కాపాడువారేరి
ఎరుకువ నొందక ఆగమమెరుగక
నరక కూపములో పడుతారేమి (2)
బ్రహ్మజ్ఞానులు అంటారేమి స్వార్థం వీడరేమి

ఒమ్మికగా యాగం చేయుదురేమి అన్నతం వీడరేమి

గమ్మున పురందర విఠలుని ముందర అ

హము వీడి మ్రొక్కలేదేమి (3)

***(2) పారిస్ పతివ్రత***

డాక్టర్ కరుణశ్రీగా ప్రసిద్ధి చెందిన జంధ్యాల పాపయ్యశాస్త్రిగారిని గురించి తెలియని తెలుగువారుండరు. అమరగాయకులు ఘంటసాల ఆలపించిన ప్రయివేట్ పాటలలోని పుష్పవిలాపము, కుంతీ కుమారి వంటి పాటలకు పదకర్త ఈయనే. కరుణశ్రీ కవితామ తల్లి - లలిత లలితంగా సన్నజాజులు మరువంతో అల్లిన పూలదండను ధరించిన నిండు లలనామణి సౌందర్య శోభను మృదువు మధుర స్మృతులలోకి తీసుకుంటుంది. ఈ కవిగారి మరో వ్యంగ్య కోణాన్ని తెలిపే 'ప్యారిస్ పతివ్రత'నూ మరి చిత్తోల్లాసంగా చిత్తగించదగిందే! విశ్వసంస్కృతులను వీక్షించు కాంక్షతో దేశదేశములను తిరుగాడుతున్న ఓ గొప్పస్వామికి - పరమరమ్యమైన ప్యారిసు నగరంలో ఒక మహాద్భుతం కనిపించిందట.' మగువ మిన్న యొకతె మగని సమాధికి విసనకఱ్ఱ తోడ విసరడమే' ఆ విచిత్ర దృశ్యం!

సంచిలో మంచి మంచి గంధపు పొడి ఇంత తీసి సమాధి చుట్టూ చల్లి చేతిరుమాలుతో మెత్తమెత్తగా ఒత్తుతుండే ఆ నిండు జవ్వనిని చూసి స్వామివారికి పరవశం కలిగిందట "బ్రతికినంతవరకు పతిని సేవించుమా|భారతీయ మహిళ పరమభక్తి|చచ్చి 'గోరి' నడుమ శయనించు మగనికి| సేవచేయుచున్నదేవి వీవు' 'ఇంత భక్తి మాకు విరుగొల్పె. భరతసాధ్వి కంటే పై చెయి నీ చెయి! ఓ పతివ్రతా నీకు నమోస్తు" అని ప్రశంసలకు పూనుకున్నాడు స్వామీజీ.

***అప్పుడు ఆ ప్యారిస్ మోహనాంగి ఏమని బదులిచ్చిందో తెలుసాండీ!***

"గౌరవమ్ముకాదు, కుతూహలము కాదు| భక్తి కాదు, ప్రణయ రక్తికాదు|
మరణ శయ్యమీది మగడు రమ్మని నన్ను |చేతిలోన చేయి చేర్చి పలికె|
'ఏను పోయినంత ఇంకొక్క మగవాని| నీవు పెండ్లి యౌట నిశ్చయంబు|
పడతి! నా సమాధి తడియారు వరకైన | ఆగు మీవు పెండ్లియాడకుండ|
అంచు కనుల నీరు నించు భర్తకు 'సరే|లే' వంటంచు మాట ఇచ్చినాను|
అతడు చచ్చిపోయె |నార్మములిట పూడ్చి పెటినారు, గోరికట్టినారు|
ఈ సమాధి కష్ట ఏ పాళ్ళు కలిపిరో| ఎట్టి అడుసు పోసి ఏడ్చినారో|
పాడు బేలుదార్లు | ఏది పదిజాములకు కూడ| ఈ సమాధి ఆరదేమి? స్వామి!

ప్రియుడు ఫోను చేసి, ప్రేమ లగ్నము దానె| వేచి వేచి కనులు వాచిపోయె| మగని కొసగి నట్టి మాట పట్టింపుకై|విసనకర్ర తెచ్చి విసురుచుంటి' - అంచు చేతిగుడ్డ అంచుతో చెక్కిళ్ళు తుడుచుకుంటూ బెంగ పడ్డదిట, పాపం, ఆ ప్యారిస్ పతివ్రత! - స్వామీజీ షాక్!

***(3) ఆగతాంబూలం***

చమత్కారాలు చెప్పుకునేటప్పుడు చరిత్ర పట్టించుకోకూడదు. దండీ, కాళిదాసు సమకాలీనులు కాకపోయినా వారిద్దరిని కలిపి చెప్పిన ఒక తమాషా కథ ఈ మధ్య నేను చదివాను మల్లాది హనుమంతరావుగారి 'చమత్కార శ్లోక మంజరి'లో. దాని సంక్షిప్త నకలు రూపమే ఇది పాఠకుల మనోహ్లాదం కోసం అందిస్తున్నాను.

కాళిదాసూ, దండీ ఓ రోజు సాహిత్య గోష్ఠి నిర్వహించుకుంటూ అలా వీధిలోకి నడిచి వెళుతున్నారుట. ఒక దుకాణం ముందు తాంబూల సేవనం కోసం ఆగారు. దండిగారికి సున్నం కావాలి. కాళిదాసుగారికి ఆకులు కావాలి. దుకాణంలోని పడుచుపిల్లతో దండే

ముందు మాట కలిపారు. తూర్ణమానీయతాం చూర్ణం పూర్ణ చంద్ర నిభాననే' - త్వరగా సున్నం ఇప్పించమ్మా .. ఓ పూర్ణ చంద్రుడివంటి మోముగల చిన్నదానా!'

కాళిదాసు కూడా తమలపాకులు కోరుతూ పద్యం పూర్తిచేశారు.

'పర్ణాని స్వర్ణ వర్ణాని, కర్ణాంత కర్ణలోచనే' - చెవులవరకూ వ్యాపించిన విశాలనేత్రాలు గల సుందరీ! బంగారు వన్నెగల తమలపాకులు కూడా ఆ చేత్తో ఇప్పించు'-

ఆ చిన్నది ముందు కాళిదాసుకే ఆకులు అందించడంతో దండి మొగం చిన్నబోయింది. 'ముందు అడిగింది నేను. నీవూ ఈ ధారానగరాధీశ్వరుడు బోడిరాజులాగా కాళిదాసు పక్షపాతిలాగా ఉన్నావే? ఆయనే మిన్నా నాకన్నా ఎక్కువ ప్రతిభావంతుడనుకున్నావా?' అని నిలదీసిన మహాకవికి ఆ చిన్నది అంత దీటుగా ఇచ్చిన సమాధానంలోనే ఉన్నది చమత్కారమంతా వినండి! 'అయ్యా! దుకాణంలో సరుకులు అమ్ముకునే దాన్ని.. నాకు కవిత్వాలూ, ప్రతిభలు ఎలా అర్థమవుతాయి.. చెప్పండి! నా చిన్ని బుర్రకి కాళిదాసుగారు శ్లోకంలోని 'పర్ణాని, స్వర్ణ వర్ణాని, కర్ణాంతకీర్ణ లోచన్ 'లోని అయిదు 'ణ'లే వినిపించాయి. మీ శ్లోకం, తూర్ణం అనీయతాం చూర్ణం పూర్ణ చంద్ర నిభాననే'లో మూడు 'ణ'లే ఉన్నాయి. మూడణాలకన్నా అయిదణాలు ఎక్కువ కాబట్టి పెద్దబేరం ముందు ముగించాను స్వామీ!

నిజానికి ఆ సరుకులమ్ముకునే అమ్మాయీ మంచి సరసురాలే.

కాళిదాసు మీదున్న విశేషాభిమానాన్ని తన జాణతనంతో ఎలా సర్దిచెప్పిందో.. చూసారా! చమత్కారానికి ఎంతవారలైనా దాసులవాల్సిందేకదా!

***(4)కవిబ్రహ్మలు***

బ్రహ్మసృష్టికంటె కవి బ్రహ్మ సృష్టి విశిష్టమైనది కాకపోయినా విఖ్యాతమైనదే. మేనక మహాతల్లి ఎంతమందిని కన్నదో. ఎంతమందిని పారవేసిందో.. వారి పేర్లైనా మనకు తెలియవు కానీ శకుంతల శాశ్వత కీర్తికి కాళిదాసు సృజన శక్తే కారణం కదా!

శకుంతల కనీసం ఒక అమ్మ కన్న బిడ్డ. కవిబ్రహ్మలైన వాళ్ళు తల్లిగర్భంతో నిమిత్తంలేకుండా.. తమ మస్తిష్కంలో నుంచి పుట్టిన వారికి సయితం శకుంతలను మించి పేరు ప్రఖ్యాతలు తెప్పించి పెడుతుంటారు.

కానన్ డాయిల్ బుర్రలో నుంచి పుట్టిన పత్తేదార్ (డిటెక్టివ్) షెర్లాక్ ఉన్న పేరు నిజమైన ఏ పత్తేదారుకూ లేవు. లండన్ బేకర్ స్ట్రీట్‌లో షెర్లాక్ హోమ్స్ నివాసమని డాయిల్ వ్రాశాడు. షెర్లాక్ అభిమానులు తమ ఆరాధ్య దేవుడి సందర్శనం కోసం తీర్థయాత్రికులకు మల్లే రావడం పెరిగిపోవటంతో లండన్ ప్రభుత్వం వారు వారికి ఆశాభంగం కలిగించకుండా ఒక హోమ్స్ క్లబ్‌ని భారీ ఎత్తున ప్రారంభించాల్సి వచ్చింది.

అలాంటి క్లబ్ తరహాలోనే జనీవా దగ్గరా ఇంకో షెర్లాక్ హోమ్స్ స్మారక చిహ్నం వెలిసిందిట కానీ ఎందుకో దానికి తగినంత ప్రచారం లభించలేదు. ఒక అర్థరాత్రి ఒక దొంగ దూరి అందులోని ఖరీదైన వస్తువులను దొంగిలించే ప్రయత్నంలో పట్టుబడి వార్తలకెక్కడంతో షెర్లాక్ హోమ్స్ ఉనికి మళ్ళీ లోకానికి గుర్తుచేసినట్లయిందట.

దొంగలను తెలివిగా పట్టుకునే షెర్లాక్ హోమ్స్‌ని చివరికి ఒక దొంగ వెధవ తిరిగి ప్రాభవంలోకి తీసుకురావడం.. విధి రాసే సృష్టినాటకంలోని ఒక సెటైరికల్ ఎలిమెంట్‌ని ఎలివేట్ చేయటంలేదూ!

వ్యంగ్యమా.. మజాకా! నాటి వాల్మీకి రామాయణం నుంచీ .. నేటి కన్యాశుల్కం దాకా.. వ్యంగ్యవైభవం కల్పించిన శాశ్వతత్వానికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. సమయం సందర్భం వచ్చినప్పుడల్లా వాటిని తలచుకుంటూనే ఉందాం. ప్రస్తుతానికి స్వస్తి.

Post your comments